# చెంప దెబ్బ

భగవంతుడు భార్యాభర్తలకు కొన్ని రోజులు విరహాన్ని ఏర్పాటు చేస్తుంటాడు.

సంతానాన్ని పొందే సమయంలో, ఎందుకో, బహుశః వియోగంలో వారి ప్రేమ దినదినాభివృద్ధి చెందాలనేమో. మా ఆవిడ పురిటికి వెళ్ళి వారం రోజులయింది. ఏమిటో తెలియని బాధ గుండెలు పిండివేసే బాధ నా శరీరంలో కొన్ని ముఖ్యమైన భాగాలు ఎవరో పట్టుకుని నలిపి వేస్తున్నట్లు బాధ. అర్థంలేని ఆవేదన, కళ్ళు మూసుకున్నా, తెరిచినా తీయని స్వప్నాలు, మా ఆవిడతో గడిపిన మధురక్షణాలు. కళ్ళు మూసుకుని పడకకుర్చీలో పడుకున్నాను.

" సార్ " కళ్ళు తెరిచాను. ఎదురుగా రాములు, మా ఆఫీసులో అటెండరు.

" ఏమిటి రాములూ "

" అయ్యగారు తమర్ని ఒకసారి అర్జెంటుగా వచ్చి వెళ్ళమన్నారు సార్ "

" సరేలే వెళ్ళు " అని ఆలోచించసాగాను. సాయంకాలం ఆరు గంటలు అయింది. ఈ సమయంలో ఎందుకు పిలిచినట్లు ? ఆఫీసులో పెండింగ్ ఫైల్సులేవు. ఏం కొంప మునిగిందో, పైనుంచి ఏవైనా అర్జెంటు కాగితాలు వచ్చి వుంటాయి. అసలే మనస్సు బాగా లేదు. ఇదేమిటి ? అనాలోచితంగా ఇంటికి తాళంవేసి ఆఫీసరుగారి యింటికి బయలుదేరాను.

గేటు తీస్తుంటే కుక్క అడ్డుపడింది. " రాజా ఇటు రా " అని రాములు కుక్కను తీసుకువెళ్ళాడు. ఆఫీసరుగారు లాన్స్‌లో కూర్చుని వున్నారు. ఆయన ఎదురుగా ఒక అందమైన అమ్మాయి, కాదు స్వప్నసుందరి కూర్చుని వుంది.

నాకు తెలుసున్నంత వరకు ఆయనకు పెద్ద అమ్మాయిలు లేరు. అయితే ఈ అమ్మాయి ఎవరు ?

" గోపీ ! రావయ్యా, అలా నిలబడి పోయావేం " ఆయన కేకవేసే వరకు నేను ఈ లోకంలోకి రాలేదు.

ఒక కుర్చీ ఖాళీగావుంది. " కూర్చో " అన్నారు. నేను కూర్చోలేదు.

" ఇది ఇల్లు గోపీ ఫర్వాలేదు కూర్చోవయ్యా " అన్నారు. ఇబ్బందిగా కూర్చున్నాను.

" ఈ అమ్మాయి నా చెల్లెలు. పేరు స్వప్న. ఈ సంవత్సరం మెట్రిక్ పరీక్షలకు వెళుతుంది. ఇంగ్లీషులో పూర్. నువ్వు ఇంగ్లీషులో జీనియస్‌వికదా : నీ దగ్గర ఇంగ్లీషు చెప్పించుకోమని సలహా యిచ్చాను. అయినా నువ్వు ఒప్పుకోవాలి కదా ! " ఆయన మాటలు పూర్తికాలేదు,

" ఎంతమాట సార్ మీరు ఏ పని చెప్పినా చేయటానికి నేను సిద్ధం " అని నా నిర్ణయం తెలియచేశాను.

" మరి ఎప్పటినుండి రమ్మంటారు " అన్నాను.

"నువ్వు రావటమేమిటయ్యా నువ్వు గురువు. అది శిష్యురాలు. ఆదే మీ యింటికి వస్తుంది. సాయంకాలం నువ్వు ఆఫీసునుండి యింటికి వచ్చాక ఒక గంట ఆగి వస్తుంది.

రోజూ ఆరు గంటలకు వస్తుంది. ఒక గంట లేదా నీ ఇష్టం వచ్చినంత సేపు చెప్పు. సరేనా" అన్నారు.

"సరే సార్" అని లేవబోయాను.

రాములు కాఫీలు పట్టుకువచ్చాడు. తల వంచుకుని కాఫీ త్రాగి బయట పడ్డాను.

స్వప్నసుందరికి పాఠాలు చెప్పడం నిజంగా నా జీవితంలో ఒక తీయని స్వప్నం.

* * *

మరునాడు ఆఫీసు నుండి యింటికి వచ్చి వంట చేసుకుని ఈజీ చైర్‌లో కూర్చుని చల్లగాలి సేవిస్తున్నాను.

"వెళ్తాను అమ్మాయిగారూ కొద్దిసేపు ఆగి వస్తాను" రాములు గొంతు విన్పించింది.

తల పైకెత్తి చూశాను. గుమ్మంలో సుమారు ఐదు అడుగుల ఎత్తు వుంటుంది. ఎత్తుకుతగిన లావు. స్వప్నసుందరి తెల్లని జాకెట్టు, తెల్లని పరికిణీ, పాలపిట్ట రంగు వోణీ, తలనిండా మల్లెలు, జాకెట్ ఆమె అందాలను దాచటానికి విశ్వప్రయత్నం చేస్తూంది. జాకెట్టుకు, పరికిణీకి

మధ్య పాలనురుగులాంటి, గులాబిరంగులో శరీరం, నడుము దగ్గర సన్నని ముడుత, జొడ్డుకు కొద్ది క్రిందుగా పరికిణి కట్టుకుంది. ఆ శరీరపు నిగారింపు చూస్తుంటే నాకు మతిపోతూంది. పాదాలకు ఎర్రని చెప్పులు. నేను కనీసం ఆ చెప్పులయినా బాగుండు ననిపించింది.

" నమస్తే మాస్టారూ " అంది. సిగ్గుపడ్డాను. అందాన్ని ఆస్వాదించడంలో జరిగిన పొరపాటుకు, ఆలస్యానికి.

" స్వప్నగారూ ! "

" నన్ను స్వప్నా అని పిలవండి చాలు. గారూ గీరూ వద్దు " అని చిలిపిగా నవ్వింది.

అదిగో మన్మధ బాణాలు మొదలయ్యాయి.

నా పతనానికి నాందీ ప్రస్థావన.

" స్వప్నా, ఇక్కడకు.... అదే ఈ ఊరు ఎందుకు వచ్చావు ? " అసందర్భపు ప్రశ్న.

" అదేం ప్రశ్న మాస్టారూ ! పరీక్షలకు కట్టాలని నన్ను మా నాన్నగారు ఇక్కడకు పంపించారు. అందుకు వచ్చాను. తెలేవారేనే రామాయణం అంతా విని సీత రాముడి కేమవుతుంది అని అడిగి నట్లుంది. నిన్న అన్నయ్య చెప్పలేదూ "

మళ్ళీ అదే చిఱునవ్వు.

" సరే ఈ రోజు గ్రామరు చెప్తా " అని గ్రామరు మొదలు పెట్టి నలభై నిముషాలు చెప్పాక

కె. బి. కృష్ణ

" మాస్టారూ "

" ఏం స్వప్నా "

" నన్ను ఊపిరి తీసుకోనిస్తారా లేక ఈ రోజే మొత్తం ఆంగ్లభాష అంతా నూరి, నా నోట్లో పోస్తారా " అని నవ్వసాగింది.

నవ్వుతుంటే ఎగసి పడుతున్న యవ్వనం. నవ్వుతుంటే అసలే గులాబి రంగులో ఉన్న ఆ ముఖారవిందం ఇంకా ఎఱుపు పులుముకోవటం, బ్రహ్మ దేముడు ఎంత చక్కని శిల్పి. అని నా మనసు గొణుగుతూంది.

నేను ఎటు పయనిస్తున్నాను ?

ఈ స్వప్న ఎవరు ? ఆఫీసరుగారి చెల్లెలు. ఆ అమ్మాయిగురించి ఇంతగా ఆలోచించటం మంచిదికాదు. అని నా మనసుకు ఎంత సరిపెట్టినా, నా చేతులు ఆమెను ఒక్కసారి తాకాలంటున్నాయి.

మా ఆవిడ లేని సమయం.

నన్ను నేను అదుపులో పెట్టుకోలేక పోతున్నాను.

అంతే నా చెంప ఛెళ్ళుమంది.

" అరె ఏమిటి మాస్టారూ అలా చెంపమీద కొట్టుకున్నారు ? అయ్యో ఎంతగా కందిపోయిందో చూడండి "

స్వప్న ఆదుర్దాగా అంటూంది. నా కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. నా జ్ఞానం ఉదయిస్తూంది.

" ఏం లేదు స్వప్నా దోమ ఒకటి కరుస్తూంది అదేపనిగా ఇందాకటినుంచి. ఒకటి వేశాను చచ్చింది " సరిపెట్టుకున్నాను.

" అమ్మాయిగారూ " రాములు వచ్చాడు. స్వప్న లేచింది. కాదు నా స్వప్నసుందరి లేచింది. అదిగో మళ్ళీ అజ్ఞానం ఉదయిస్తూంది. ఆమెవేపు చూస్తున్నాను.

వెనుక నుండి ఒక నేర్పరియైన శిల్పి చెక్కిన కుందనపు బొమ్మలా వుంది. సన్నని నడుము, జాకెట్టుకు పరికిణీకి మధ్య భాగం ఎఱ్ఱగా, గులాబిలా మెరిసిపోతూంది. వెనుకనుండి వెళ్ళి ఒక్కసారి ముద్దు పెట్టుకోవాలనిపించింది. గట్టిగా కళ్ళుమూసుకుని " భగవాన్ ఈరోజు నా మనస్సు గతి తప్పి ప్రవర్తిస్తూంది. నన్ను రక్షించు " అని వేడుకున్నాను.

* * *

రెండవరోజు స్వప్న వచ్చింది. మరల గ్రామర్ క్లాసు టేకప్ చేశాను. ఒక గంట అయ్యింది. మరలా అదే చిలిపితనం, స్వప్న నాతో ఆడుకుంటూందా ?

" మాస్టారూ. "

" ఏమిటి స్వప్నా "

" ఈ మగవాళ్ళకు బుద్ధి లేదండి. అందమైన అమ్మాయి కనపడితే వళ్ళు తెలియదు " కొరడాతో నన్ను కొట్టినట్లయింది.

" ఏమయింది " నూతిలో నుండి వచ్చింది ఆ ప్రశ్న.

" ఏముంది నేను వస్తుంటే ఒక వెధవ నన్ను చూసి, ' అబ్బ షో కేసులో పెట్టవచ్చురా ' అన్నాడు. చూడండి సంఘంలో ఆడదాన్ని గౌరవించటం నేర్చుకోలేదు మగవాళ్ళు. సారీ మాస్టారూ " అంది. అవన్నీ నాకు తగిలినయ్. వళ్ళంతా వాతలుపడ్డాయి. " ఎవడో బాగా అన్నాడు. వాడు కూడా నాలాగే రసికుడే " అనుకున్నాను.

" స్వప్నా "

" మాస్టారూ "

" ఒకవేళ రాములు లేదనుకో వాడు నిన్ను ఏదైనా చేస్తే ఏం చేసే దానివి ?"

గట్టిగా నవ్వి రెండు పిడికిళ్ళు బిగించి, స్టంట్ చేయటాన్కి ఫోజుపెట్టి వాడ్ని చిత్తు చిత్తు చేసేదాన్ని " అంటూ వుంటే పయిట తొలగింది. ఏదో చెప్పుకు పోతూంది స్వప్న. నేను దృష్టిని మరల్చుకో లేక పతనమయ్యే స్థితికి వచ్చేను. ఇంకో క్షణంలో నా రెండు చేతులు స్వప్నని తాకేవి. నాలోని అజ్ఞానం ఉదయిస్తూంది. నేను గుడ్డివాణ్ణి అవుతున్నాను. అంతే నా చెంప ఛెళ్ళుమంది. " అబ్బా " అని మూల్గింది నా హృదయం.

" మళ్ళీ ఏమిటి మాస్టారూ, ఎందుకు మీరిలా చెంపలు పగలకొట్టు కుంటున్నారు ? దోమలు ఎక్కువయితే మా ఇంట్లో మందు వుంది.

తెస్తాను అది రాసుకోండి దోమలు కుట్టవు. రేపు పట్టుకు వస్తాను. ఇల్లు అంతా మందు చల్లించండి దోమలు చచ్చిపోతాయి " స్వప్న ఆందోళనతో తన పైట సవరించుకుంది.

' దోమలు కాదమ్మా పోవలసింది. నాలోని అజ్ఞానం పోవాలి. అప్పుడే నాకు శాంతి జ్ఞానోదయం ' అని గొణుక్కున్నాను.

నా చెంప కెంపులీనినట్లు ఎఱ్ఱగా అయిపోయింది, ఐదువేళ్ళు పడ్డట్లుగా నా స్పర్శ జ్ఞానం చెపుతూంది. కాని నా అజ్ఞానం నన్ను వదలనని చెప్తూంది.

" అమ్మాయిగారూ " అంటూ వచ్చాడు రాములు.

" మాస్టారూ ! వెళ్తాను " అని లేచింది స్వప్న.

" ఉండు " అని లోపలకు వెళ్ళి ఒక పండు తీసుకువచ్చి " తీసుకో " అని చేయి చాపేను. పండు ఇస్తూ చేయి పట్టుకున్నాను. నాలో విద్యుచ్ఛక్తి ప్రవేశించింది. అజ్ఞానం ఆవహించింది. " స్వప్నా నీ చేతిలో రేఖలు చాలా బాగున్నయ్. నువ్వు చాలా అదృష్టవంతురాలవు " అన్నాను.

వెంటనే కూర్చుని " వివరంగా చెప్పండి మాస్టారూ " గోముగా అంది.

" రేపు చెప్తానులే ఆలస్యమయితే కేకలేస్తారు వెళ్ళు " అని పంపించివేశాను.

* * *

మరునాడు స్వప్న పుస్తకాలు లేకుండా వచ్చింది.

" స్వప్నా పుస్తకాలు ఏవి ? "

" ఈరోజు చదువులేదు. మీరు నా చేయి చూడాలి చెప్పాలి. అంతే సరదాగా కబుర్లు చెప్పుకుని వెళ్ళిపోతాను " అంటూ చేతిని చాచింది. చేయి పట్టుకున్నాను. చేతులలోని మెత్తదనాన్ని, వేడిని ఆస్వాదిస్తున్నాను.

" స్వప్నా,

ఇది ఆయుష్షురేఖ, నీకు నిండు ఆయుర్దాయం. ఇది దాంపత్యరేఖ. నీ కాబోయే భర్తగారు నిన్ను చాలా ప్రేమగా చూసుకుంటారు. ఇది సంతానరేఖ నీకు పద్దంటే పిల్లలు. నీ అరచేతిలో ఎంత విశాలత వుందో చూశావా, నీ హృదయం అంత విశాలమైనది.

ఇది విద్యారేఖ, నీకు చదువు పెద్దగా అబ్బదు. ఇది ధనరేఖ. నీకు డబ్బుకు ఇబ్బంది వుండదు " చెప్పుకు పోతున్నాను. చేతి స్పర్శతో నా మనసు తృప్తి పడటంలేదు. నా మనసు ఇంకా ఏమో కావాలని మారాము చేస్తూంది. గుండెలు గొంతుకలో కొట్టుకుంటున్నాయి. వళ్ళంతా చిఱుచెమటలు. గొంతు పట్టివేసింది. గతి తప్పిపోతూంది మనసు. అజ్ఞానం ఆవహిస్తూంది.

అంతే నేను చేయి ఎత్తబోయాను నన్ను నేను శిక్షించుకోడానికి. చేయి పట్టుకుంది స్వప్న. " ఈరోజు దోమలు కుట్టకుండా రాసుకునే

మందు తెచ్చాను అది రాసుకోండి. ఏదీ ఎక్కడా దోమలు " అని నా చెంపల దగ్గర చూడసాగింది. ఏముందక్కడ ? " అలవాటు కొద్దీ కొట్టబోయాను ఏమీలేదు " సరిపెట్టుకున్నాను.

" స్వప్నా ఈరోజు నాకు పనివుంది. త్వరగా వెళతావా. రేపు చెపుతాను పాఠం " అని పంపించివేశాను. జరుగబోయే అనర్థాన్ని వారించటానికి.

స్వప్న వెళ్ళింది. నాలోని అజ్ఞానం వెళ్ళలేదు. భోజనంచేసి వరండాలో పక్కవేసుకుని పడుకున్నాను. తీయని కలల కోసం నిదురలోకి జారుకున్నాను.

*  *  *

స్వప్న వచ్చింది అంతా తెల్లని బట్టలతో. ఆరోజు చీర కట్టింది. మల్లెపూవులా తెల్లగా, మనిషి గులాబి రంగులో, మనసు పిచ్చెక్కించేలా, తనువు పులకించేలా. ఇక నేను ఆగలేను, తలుపు వేశాను.

ఊహించని సంఘటన.

" స్వప్నా " అన్నాను.

తమకంతో " మాష్టారూ " అరిచింది.

" స్వప్నా నన్ను అడ్డుపెట్టకు. మన సంగతి ఎవరికీ తెలియదు. దయచేసి నన్ను ఒక్కసారి ధన్యుణ్ణి చెయ్యి " ప్రాధేయపడుతున్నాను, గొంతులో మ్రోగే గుండెల దడదడతో.

" దయచేసి నన్ను వదలండి. మీకిది న్యాయంకాదు " అని అరుస్తూంది. స్వప్నను నా కామానికి, నా తపనకు, నా అజ్ఞానానికి బలిచేశాను. స్వప్న అణువణువూ చూశాను. అంతా అయిపోయింది. మూడురోజుల నుంచి అణచుకున్న జ్ఞానం ఈరోజు శాశ్వతంగా అజ్ఞానం లోకి పయనించింది. స్వప్న రోదిస్తూ, చీర కట్టుకుని పరుగులతో వెళ్ళిపోయింది.

స్వప్న వెళ్ళిన పది నిముషాలకు రాములు వచ్చాడు.

" అయ్యగారు తమర్ని ఉన్నపళంగా తీసుకు రమ్మన్నారు " కఠినంగా ఉంది గొంతు.

అయిపోయింది. అంతా అయిపోయింది. నా పరువు, ఆఫీసరుగారిక్కి నేనంటే వున్న గౌరవం మంటకలిసి పోయింది. అజ్ఞానాంధకారంలో కామాంధకారంలో గుడ్డివాణ్ణి అయ్యాను. పర్యవసానం ఎరుర్కోవాలి తప్పదు.

వెళ్ళాను. వరండాలో ఆఫీసరుగారు పచార్లు చేస్తున్నారు. వరండాలో స్తంభానికి అనుకుని, తలవంచుకుని నుంచున్నాను.

" గోపీ ! ఐ బిలీవ్డ్ యూ కంప్లీట్‌లీ. బట్ యూ హేవ్ డిసీవ్డ్ మి.

థ్యాంక్యూ !

నీ నడవడి సరిగాలేదని పైకి వ్రాస్తాను. యూ హేవ్ టు ఫేస్ ది కాన్సీక్వెన్సెస్ " సింహంలా ధ్వనించింది ఆయన గొంతు.

నా సమాధానంకోసం ఎదురుచూడక లోపలకు వెళ్ళిపోయారు ఆయన.

పురిటికి వెళ్ళిన భార్య, నా తలిదండ్రులు, కుటుంబం, నాకు కలుగబోయే పిల్లలు, నా భవిష్యత్తు. అయ్యో! ఎంత పని జరిగిపోయింది.

" సార్ ఒకసారి నామాట వినండి. దయచేసి నామాట వినండి సార్ " అని నా తల స్తంభానికి కొట్టుకుంటున్నాను ? !

" అయ్యగారూ ఏమిటి క్రిందపడి తల నేలకేసి కొట్టుకుంటున్నారు ? " అంటూ పాలమ్మాయివచ్చి లేపింది నన్ను.

" అమ్మయ్య ఇదంతా పీడకలే. స్వప్నను ఏమీ చేయలేదు " ఆనందంగా ఆఫీసుకు వెళ్ళేను.

*   *   *

సాయంకాలం స్వప్న వచ్చింది.

" మాస్టారూ ?"

" ఏం తల్లీ నిన్నపూర్తి చేయని పాఠం ఈ రోజు పూర్తిచేస్తానులే. నిన్న అనవసర ప్రసంగం కాలక్షేపం అయిందమ్మా ఏమీ అనుకోకు " స్వప్న నన్ను ఎగాదిగా చూస్తూంది.

మూడురోజుల క్రితం మాస్టారేనా ఈయన అని సందేహం వచ్చివుంటుంది. ఆశ్చర్యంగా నన్ను చూస్తుంటే పైట జారింది "అమ్మా స్వప్నా పైట నిండుగా కప్పుకో తల్లీ " అన్నాను.

" ఏమిటి మాస్టారూ ఈ రోజు క్రొత్తగా మాట్లాడుతున్నారు. మూడు రోజులనుండి ఉన్న సరదా ఏమయ్యింది ? ఉత్తరం వచ్చిందా "

" లేదమ్మా నాకు జ్ఞానోదయమయింది నిన్ను మొదటిరోజు, మీ అన్నగారింట్లో చూసినప్పటినుంచి, నాలో పురుషశక్తి నన్ను ఏదో అధోలోకంలోనికి లాక్కుపోతూంది. అక్కడికీ చాలా సార్లు నన్ను నేను శిక్షించుకున్నాను అయినా నా వశంకాలేదు. నిన్నరాత్రి అంతా తీవ్రంగా ఆలోచించిన పిదప, ఈ రోజు ఉదయం జ్ఞానోదయం అయింది. నన్ను నువ్వు "అన్నయ్యా" అని పిలువమ్మా. నేను " స్వప్న " అనకుండా " చెల్లెమ్మా " అంటాను. అప్పుడు నా హృదయం ఉప్పొంగి పోతుంది' '

స్వప్న నన్ను కన్నార్పకుండా చూస్తూంది.

పూర్వం చూసినట్లుగా కాక, ఇప్పుడు స్వప్నను చూస్తుంటే ఆమె ఒక దేవతలా, ఒక చెల్లెలులా ఒక అపూర్వ స్త్రీమూర్తిలా కనపడుతూంది నాకు. నాలోని దురాలోచనలు కొట్టుకొని పోయాయి.

" వస్తాను అన్నయ్యా ! రేపటినుండి నేను జీవితంలో నీ దగ్గర జ్ఞాన బోధలు వింటాను " అంటూ సమాధానం కోసం చూడకుండా వెళ్ళిపోయింది స్వప్న. నా తలమీద నుండి కొండంత బరువు, నా గుండెల నుండి కొండంత ఆవేదన తొలగిపోయింది. ప్రాణం తేలికగా వుంది. హాయిగా ఉంది.

" పొగచేత నిప్పు, మురికిచేత అద్దము, మావిచేత గర్భస్థ పిండము కప్పబడి యున్నట్లు కామముచేత ఆత్మజ్ఞానము కప్పబడియున్నది.

కౌంతేయా! ఈ కామము జ్ఞానానికి నిత్య వైరి. అజ్యాది హవిస్సులచే వృద్ధి బొందినట్లు యీ కామము విషయ భోగమున వృద్ధి బొందును. ఇచ్ఛారూపకమైన ఈ కామముచే ఆత్మజ్ఞానము కప్పబడి యున్నది. "

మా ఇంటికి దగ్గరలో ఉన్న [illegible]యంలో స్వర్గీయ ఘంటసాల భగవద్గీతా గానం వినిపిస్తూంది. అవును. కామవాంఛ లేకపోతే జ్ఞానానికి అవరోధం ఏదీ!

( ' జనసుధ ' వారపత్రిక 6–7–79 )